సాక్షి
జగిత్యాల
శనివారం । 4 । నవంబర్ । 2023

నామినేషన్ల వివరాలు.. 1వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
జగిత్యాల	01	01
కోరుట్ల	01	01
ధర్మపురి	01	01

జిల్లాస్థాయి క్రీడా పోటీలు

జగిత్యాల: జగిత్యాల క్లబ్‌లో శుక్రవారం అండర్–14, 17 విభాగంలో బాలబాలికలకు జిల్లాస్థాయి షటిల్, బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీరాం నాయక్ తెలిపారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెటా అధ్యక్షుడు విశ్వప్రసాద్, అశోక్, కృష్ణప్రసాద్, అజయ్, దయాకర్, వేణు, భాస్కర్ పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ కవితను కలిసిన బాపురెడ్డి



ఎమ్మెల్సీ కవితతో బాపురెడ్డి, నాయకులు

కథలాపూర్(వేములవాడ): ఎమ్మెల్సీ కవితను కథలాపూర్ మండలానికి చెందిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శుక్రవారం కలిశారు. వేములవాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ పరిస్థితిపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మీ నరసింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని స్థానిక నేతలకు కవిత సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, నాయకులు పిడుగు తిరుపతిరెడ్డి, మొలిగె శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



గొర్రెకు టీకా వేస్తున్న సిబ్బంది

గొల్లపల్లి(ధర్మపురి): పశువులకు పెంపకందారులు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బోనగిరి నరేశ్ అన్నారు. మండలంలోని తిర్మలాపూర్ (పీడీ), రంగదామునిపల్లి గ్రామాల్లో శుక్రవారం గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడునెలలు పైబడిన అన్ని గొర్రెలు, మేకలు వ్యాధుల బారిన పడకుండా పెంపకందారులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రవీందర్, సిబ్బంది మధుసూదన్, మెటిన్, సంధ్య, రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వయోవృద్ధులను ఆదరించాలి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న భాస్కర్ తదితరులు

జగిత్యాల: వయోవృద్ధులను ఆదరించాలని, వారిని అన్ని విధాల చూసుకోవాలని సంక్షేమాధికారి భాస్కర్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వారు రూపొందించిన, వృద్ధులకు సంబంధించి సేవలు చేస్తున్న బ్రోచర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సామాజిక సేవగా వృద్ధులను ఆదుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, విజయ్, హన్మంతరెడ్డి, ప్రకాశ్, అశోక్‌రావు, చంద్రమోహన్, శైలజ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

జగిత్యాలక్రైం: అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్టోబర్ 9 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 51 మందిపై 219 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. 1,714 లీటర్ల గుడుంబా, 775 కిలోల బెల్లం, 210.59 లీటర్ల లిక్కర్, 209.25 లీటర్ల బీర్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే 71,276 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 97 మందిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆదేశాల మేరకు అనధికారిక మద్యం నిల్వలు, అక్రమ రవాణా గురించి ప్రజలు టోల్‌ఫ్రీ నంబరు 1800 425 2523 లేదా 8019108768 ఫోన్ చేసి తెలుపాలని కోరారు. మద్యం వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్లలో వెరిట్ అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. అప్లికేషన్ ద్వారా మద్యం నకిలీయా లేదా అసలైందా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

మంచి, చెడు గుర్తించండి



కోరుట్లలో ఆశీర్వాద సభకు హాజరైన జనం



సభలో మాట్లాడుతున్న, సీఎం కేసీఆర్ పక్కన బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

- కోరుట్ల బిడ్డ సంజయ్‌ను ఆశీర్వదించండి
- ప్రజల కష్టాలు తెలిసినవాడు
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

కోరుట్ల: యువకుడు.. వైద్యుడు.. కోరుట్ల బిడ్డ బీఆర్‌ఎస్ అభ్యర్థి డా.కల్వకుంట్ల సంజయ్‌ను ఆశీర్వదించాలని సీఎం కేసీఆర్ కోరారు. శుక్రవారం కోరుట్ల ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. మంచి చెడు ఆలోచించి ప్రజల కష్టాలు తెలిసిన సంజయ్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. పార్టీల చరిత్ర, నడవడిక అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏంసేవ చేశారన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓటును సద్వినియోగం చేయాలన్నారు. గతంలో కోరుట్లకు చాలాసార్లు వచ్చానని ఇక్కడి చేనేత, బీడీ కార్మికుల కష్టాలు తెలుసన్నారు. అందుకే ఎవరు అడగకున్నా చేనేత కార్మికులకు పింఛన్లు, బీడీ కార్మికులకు జీవనభృతి ఇస్తున్నామని వివరించారు. పేదల సంక్షేమం కోసమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ దిశలో లెక్కలేని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కోరుట్ల సెగ్మెంట్‌లో రెండు రెవెన్యూ డివిజన్లతో పాటు తాను బండలింగాపూర్‌కు వచ్చిన సమయంలో చెరువులు చూశామని, అక్కడి ప్రజలు మండలంగా మార్చాలని కోరితే ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో రూ.70 నుంచి రూ.200 పింఛన్ చూశామని, బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే రూ.2వేలు చేశామన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో పింఛన్ ఏడాదికి రూ.500 చొప్పున రూ.5వేలకు చేరుతుందని పేర్కొన్నారు.



కేసీఆర్ దీక్ష స్ఫూర్తి: బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్

తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నేత కేసీఆర్ దీక్ష స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డా.కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ప్రజాఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ, ×నేను మీ గడ్డ మీద పుట్టిన బిడ్డను..మీరు పీల్చిన గాలి పీల్చినవాన్ని..మీ కష్టసుఖాల్లో నాన్నతో పాటు పాలుపంచుకున్న..ఈ ఎన్నికల్లో నన్ను ఆదరించండి* అని కోరారు. కోరుట్లలో వరద కాల్వలో క్రికెట్ ఆడేవాళ్లం, ఇప్పుడు నిండా నీటితో కళకళలాడుతోందని తెలిపారు. మీకు సీఎం కేసీఆర్ చాలా చేశారు. ఇంకా కొంత మంది బీడీ కార్మికులకు జీవనభృతి రావాలని, వారందరికీ ఇవ్వాలన్నారు. ఎంపీగా బీజేపీ అర్వింద్‌కు అవకాశం ఇచ్చారు. అర్వింద్ ఐదేళ్లలో చేసింది గుండుసున్నా అన్నారు. సభలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎల్.రమణ, జెడ్పీ చైర్మన్ దావ వసంత, గొడిసెల రాజేశంగౌడ్, ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రావ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మున్సిపల్ చైర్మన్లు అన్నం లావణ్య, రనవేని సుజాత, జెడ్పీటీసీలు దారిశెట్టి లావణ్య, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కంటాల భారతి, ఎంపీపీలు తోట నారాయణ, మారు సాయిరెడ్డి, కాటిపెల్లి సరోజన, జాజల భీమేశ్వరి, కోరుట్ల పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ నా ప్రాణాలు కాపాడాడు

కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డా.సంజయ్ 2009లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా చేపట్టిన నిరాహార దీక్ష సమయంలో వైద్యుడిగా తన వెంట ఉండి ప్రాణాలు కాపాడారని సీఎం అన్నారు. యువకుడు, వృత్తిపరంగా వైద్యుడు సంజయ్ తలుచుకుంటే వైద్య వృత్తిలో కోట్ల రూపాయలు సంపాదించవచ్చు, కానీ తండ్రి కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు బాటలో ప్రజాసేవ కోసం మీ ముందుకు వచ్చాడు. ఆయనను మీరంతా ఆశీర్వదించిఅక్కునచేర్చుకోవాలని కేసీఆర్ కోరారు.



సంజయ్ యువసేన కేరింతలు

సభ సైడ్‌లైట్స్

కోరుట్ల/కోరుట్లరూరల్: కోరుట్ల శివారులో ఏర్పాటు చేసిన సభ ప్రాంగణానికి మధ్యాహ్నం 2 గంటలకే భారీ సంఖ్యలో జనం చేరుకున్నారు.

- సభాప్రాంగణం పూర్తిగా జనంతో నిండిపోవడంతో ఇంకా వేలాది మంది జాతీయ రహదారిపై నిలబడి వీక్షించారు.
- సభలో కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి.
- ఆర్మూర్ నుంచి సాయంత్రం 4.42 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకున్న కేసీఆర్.. ఆ తర్వాత 4.45 గంటలకు సభాస్థలికి వచ్చారు.
- ముందుగా సభలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడి ఒక నిమిషంలోనే ప్రసంగాన్ని ముగించారు.
- తర్వాత కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ 4 నిమిషాలు మాట్లాడి పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు.
- అనంతరం 4.51గంటలకు కేసీఆర్ ప్రసంగం మొదలుపెట్టి 5.08 గంటలకు ముగించారు.
- ప్రసంగం చివరలో ఒక నిమిషం మైనార్టీలను ఉద్దేశించి హిందీలో మాట్లాడారు.
- 5.14 గంటలకు సీఎం కేసీఆర్ హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.

అభివృద్ధి చేశా.. నా కొడుకును గెలిపించండి: ఎమ్మెల్యే కల్వకుంట్ల

- కోరుట్ల సెగ్మెంట్‌లోని కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలతో పాటు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో పూర్తిస్థాయి అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నానని ఆరోగ్యం సహకరించకపోవడంతో తన తనయుడు డా.సంజయ్‌ను అభ్యర్థిగా నిలిపానన్నారు. తన చివరి శ్వాస వరకు నియోజవకర్గ ప్రజలకు అందుబాటులోనే ఉంటానని స్పష్టం చేశారు. అందరూ అండగా నిలిచి సంజయ్‌ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

సీఎంకు ఘన స్వాగతం



సీఎం కేసీఆర్‌కు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల: కోరుట్లలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు శుక్రవారం సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్‌లో రాగా, హెలిప్యాడ్ వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ తిలకం దిద్ది స్వాగతం పలికారు. అనంతరం సీఎం సభలో పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల్లో జోష్

కోరుట్ల/కోరుట్లరూరల్: ఆశీర్వాద సభ విజయవంతం కావడం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. సభకు సుమారు 70వేల మందిని తరలించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ భావించిన మేరకు జనం రావడం గులాబీ శ్రేణులకు కొత్త ఉత్సాహం ఇచ్చింది. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల నుంచి బస్సుల్లో పెద్ద ఎత్తున జనం రావడంతో జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. చాలా మంది సభాస్థలికి చేరుకోవడం కష్టంగా మారడంతో బస్సుల్లోనే ఉండిపోయారు. ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో కళాకారుల ఆటపాట సభికులను అలరించాయి. సభ ముగిసే సమయంలో గల్ఫ్ వెళ్లి తిరిగివచ్చిన ఓ యువకుడు తమ సమస్యలు ప్రస్తావించలేదని నిరసన తెలిపే ప్రయత్నం చేయగా పోలీసులు సర్ది చెప్పారు. సభ ముగిసిన తరువాత జనం తిరిగి వెళ్లే సమయంలోనూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

మూడింటితో షురూ

- మొదలైన నామినేషన్ల పర్వం
- జగిత్యాల, కోరుట్ల, ధర్మపురిలో ఒక్కొక్కటి చొప్పున దాఖలు







జగిత్యాలలో నామినేషన్ దాఖలు చేస్తున్న సత్యనారాయణమూర్తి, కోరుట్లలో నామినేషన్ వేస్తున్న రఘు, ధర్మపురిలో నామినేషన్ వేస్తున్న మహిపాల్

జగిత్యాల: శాసనసభ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల పర్వం శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు జిల్లాలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. జగిత్యాల నియోజకవర్గంలో పిరమిడ్ పార్టీ తరుపున డాక్టర్ వి.సత్యనారాయణమూర్తి నామినేషన్ దాఖలు చేయగా, కోరుట్ల నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థి ముత్యం రఘు, ధర్మపురి నియోజకవర్గంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి దూడ మహిపాల్ నామినేషన్ దాఖలు చేశారు. తొలిరోజు మూడు మాత్రమే నామినేషన్లు రాగా, మంచి రోజు చూసుకుని ప్రధాన అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉంది.

అన్ని కాలమ్స్ నింపాల్సిందే..

నామినేషన్ అనేది అభ్యర్థి పోటీలో ఉంటారా లేదా అనేది నిర్ణయించే ప్రక్రియ. అభ్యర్థులు నామినేషన్లు వేసే సమయంలో అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు, రాబడి, ఖర్చులు, క్రిమినల్ కేసులేవైనా ఉంటే వివరాలన్నీ నమోదు చేయాలి. అఫిడవిట్‌లోని కాలమ్స్ అన్ని తప్పనిసరిగా పూరించాలి. లేకుంటే సదరు అభ్యర్థికి ఆర్వో నోటీసులు జారీ చేస్తారు. నామినేషన్ల పరిశీలనకన్నా ముందే అన్ని కాలమ్స్ పూర్తి చేయాలి. లేకుంటే నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంటుంది.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

నామినేషన్ ప్రక్రియ ప్రారంభంతో రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నామినేషన్లు స్వీకరించే కేంద్రం నుంచి 100 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమలులో ఉండగా, 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థులు తమ ర్యాలీలు, వాహనాలను నిలిపివేయాల్సి ఉంటుంది. అభ్యర్థులతో పాటు, ఇద్దరు ముగ్గురు వెళ్లాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద గట్టి బందోబస్తు, బారికేడ్లు ఏర్పాటు చేశారు.

దళితుల సంక్షేమానికే దళితబంధు

- మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: దళితుల సంక్షేమానికే సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం మంత్రి మాట్లాడుతూ, గురువారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు జనం భారీగా తరలిరావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతీ దళిత కుటుంబానికి దళితుబంధు అందజేస్తామని సీఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికే 40 వేల కుటుంబాలకు పథకం అందించారని మరో 2.70 లక్షల కుటుంబాలకు అందించే లక్ష్యాన్ని పెట్టుకున్నారని, ఎన్నికల అనంతరం నెరువేరుస్తారని స్పష్టం చేశారు. కాగా సీఎం కేసీఆర్ దళితబంధును అర్హులందరికీ వర్తింపజేస్తామని సభలో ప్రకటించడంపై స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో సీఎం, మంత్రి కొప్పుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వివిధ మండలాల నుంచి మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

బీఆర్‌ఎస్ పథకాలు వివరించాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

రాయికల్(జగిత్యాల): సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ వివరించాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం అల్లీపూర్‌కు చెందిన వివిధ పార్టీల యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, తన గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రత్నాకర్‌రావు, ముకీద్, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, మహేశ్, సాయిరెడ్డి, శ్రీను, తిరుపతి, జలపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై..

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు చూసే ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్లకు చెందిన 100 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, లక్ష్మీపూర్‌కు చెందిన 20 మంది గంగపుత్ర సంఘం సభ్యులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో దావ సురేశ్, బాలముకుందం, సర్పంచ్ చెరుకు జాన్, ఆత్మ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీటీసీలు ఆరె సౌజన్య, సునీత పాల్గొన్నారు.

వ్యయ పరిశీలకులొచ్చారు

- ఒక్కొక్కరికి ఒకటి నుంచి 4 నియోజకవర్గాలు
- జిల్లాకు ఇద్దరు చొప్పున నియామకం

కరీంనగర్ అర్బన్ : శాసనసభ ఎన్నికల క్రమంలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా ఇప్పటికే వ్యయ పరిశీలకులను నియమించిన విషయం తెలిసిందే. శుక్రవారం జిల్లాకు వ్యయ పరిశీలకులు రాగా నామినేషన్లు ముగిసేలోపు సాధారణ, పోలీస్ పరిశీలకులు రానున్నారు. నాలుగు దఫాలుగా మకాం వేయనుండటంతో ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. ప్రభుత్వ అతిథి గృహాలను వారికి అనువుగా మలుస్తున్నారు.

నాలుగు దశల్లో జిల్లాలో మకాం

- శాసనసభ ఎన్నికల్లో జరిగే వ్యయంపై పారదర్శకంగా వ్యవహరించేందుకు ఎన్నికల వ్యయ పరిశీలకులు సిబ్బందిని ఆదేశించనున్నారు. బీహార్, మహారాష్ట్ర, పుదుచ్చేరి, పశ్చిమబంగ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను కేటాయించారు.
- ఎన్నికల సాధారణ, పోలీస్ పరిశీలకులుగా ఇతర రాష్ట్రాలకు చెందిన సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌ను నియమించారు. వీరంతా వారికి కేటాయించిన నియోజకవర్గాల పరిధిలో జరిగే ప్రచార సరళిని నిశితంగా పరిశీలించనున్నారు.
- నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, పోలింగ్, లెక్కింపు ఇలా నాలుగు దశల్లో జిల్లాలో ఉండి పరిస్థితిని సమీక్షించనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన దరిమిలా అభ్యర్థుల పూర్తి ఖర్చుల వివరాలను మదింపు చేసి ఎన్నికల సంఘానికి నివేదించనున్నారు.
- అభ్యర్థి కదలికలు, వ్యయ, ప్రచార సరళిని పరిశీలించి ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరిస్తారు. ఇతర రాష్ట్రాల వారు కావడంతో పర్యవేక్షణ పారదర్శకంగా ఉంటుందన్నది ఎన్నికల సంఘం ఉద్దేశం. పోలీస్ పరిశీలకులు శాంతిభద్రతలను సమీక్షిస్తారు.



వ్యయ పరిశీలకుడితో కలెక్టర్ పమేలా సత్పతి

నియోజకవర్గాల వారీగా ఇలా..

కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు నియోజక వర్గాలకు కేటాయించిన ఎన్నికల వ్యయపరిశీలకులు కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌజ్‌కు చేరుకోగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఘనంగా స్వాగతం పలికారు. చొప్పదండి, కరీంనగర్ నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులు శివ్ కుమార్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు చిట్టే యోగేష్ సుగ్దియోలకు కలెక్టర్ జిల్లాలోని నియోజకవర్గాలు, మండలాలు, పోలింగ్ కేంద్రాలు, తదితర వివరాలు అందించారు.

నియోజకవర్గాల వారీగా పోలీస్ పరిశీలకులు వీరే

అధికారి, కేటాయించిన నియోజకవర్గాలు

- వివేకానంద్ సింగ్(ఐపీఎస్) : కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి
- కుంతల్ కిషోర్ : రామగుండం, మంథని, పెద్దపల్లి
- ఎ.సతీష్‌గణేశ్ : కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్
- వినీతసాహు : వేములవాడ, సిరిసిల్ల

సాధారణ పరిశీలకులు వీరే

- రాజీవ్ రంజన్‌మీనా(ఐఏఎస్) : కోరుట్ల
- హెచ్.బసవరాజేంద్ర : జగిత్యాల, ధర్మపురి
- రాజేశ్‌సింగ్ రాణా : రామగుండం
- సీఎస్ శ్రీధర : మంథని, పెద్దపల్లి
- సీఆర్.ప్రసన్న : కరీంనగర్, చొప్పదండి
- రవికుమార్ :మానకొండూరు, హుజూరాబాద్
- జగదీష్‌సోంకర్ : వేములవాడ, సిరిసిల్ల

గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

సారంగాపూర్(జగిత్యాల): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ఏర్పాటు తర్వాత గల్ఫ్‌లో మృతిచెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించి ఆదుకుంటామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. యువకులు ఉపాధి కోసం గల్ఫ్ వెలుతున్నారని, అక్కడ ఉపాధి లభించక, ఇతరత్రా కారణాలతో పలువురు చనిపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియ ప్రారంభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ఏడాదిలోపు దీనిని సంపూర్ణంగా అమలు చేయకుంటే పదవికి రాజీనామా చేసి అవసరమైతే పార్టీపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉంటానని ఉద్వేగంతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమ్మునూర్‌కు చెందిన తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మరమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

అభ్యర్థుల తప్పుడు వివరాలపై మీరూ ఫిర్యాదు చేయొచ్చు



ఓటు అనేది ప్రతీపౌరుడి హక్కు. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడే బాధ్యత మనదే
– హిల్లరీ క్లింటన్

మీకు తెలుసా..?

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ఘట్టం ప్రారంభం కాబోతుండగా సామాన్యులూ ఎన్నికల క్రతువులో భాగం కావొచ్చు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో తమ విద్య, వ్యాపారం, ఆస్తులు, అప్పులు, నేరచరిత, వారసత్వ సంపదను వారి అఫిడవిట్‌లో పొందుపరచాలి. దీన్ని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. కొందరు తమ వివరాలను తప్పుగా చూపే అవకాశం కూడా ఉంది. అయితే.. అభ్యర్థులు సమర్పించిన వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే, లేదంటే ఫిర్యాదులు ఉంటే ఎవరైనా తెలియజేయొచ్చు. నేరుగా వారిపై ఫిర్యాదు చేయొచ్చు. అభ్యర్థి తన నామినేషన్ పత్రాన్ని సంబంధిత అధికారికి అందించిన వెంటనే ఆన్‌లైన్ ద్వారా ఎన్నికల సంఘానికి పంపిస్తారు. అనంతరం ఆ కార్యాలయ నోటీస్ బోర్డుపై అభ్యర్థుల అఫిడవిట్ ఉంచుతారు. వీటిని ఎవరైనా పరిశీలించి, సమాచారం తప్పుగా ఉన్నట్లు తెలిస్తే అభ్యంతరాలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చు.

క్లుప్తంగా

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా శంకర్



రాయికల్(జగిత్యాల): బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడిగా రాయికల్ పట్టణానికి చెందిన కాయితి శంకర్‌ను నియమించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు.

జనశక్తిలో చేరేందుకు ఇద్దరి యత్నం

- పట్టుకున్న పోలీసులు



అంజయ్య, రవి

కోరుట్లరూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లికి చెందిన అందుర్తి అంజయ్య, బొల్లె రవి జనశక్తి వైపు ఆకర్షితులవుతున్నారన్న సమాచారంతో పోలీసులు వారిని శుక్రవారం పట్టుకున్నారు. వ్యక్తిగత కక్షలతో జనశక్తి పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసి, కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని గానీ నక్సల్స్ వైపు ఆకర్షితులై, భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని కోరారు. పోలీసుశాఖ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు.

జనావాసాల్లోకి కొండచిలువ



యైటింక్లయిన్ కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 18వ డివిజన్ అల్లూరు గ్రామ శివారులో గంగిరెడ్డులవాళ్ల నివాసం ఉండే గుడిసెల్లోకి శుక్రవారం రాత్రి కొండచిలువ చేరింది. అక్కడి కుక్కపిల్లలను మింగేసింది. దానిని చూసిన కొంతమంది కర్రలతో కొట్టడంతో ముళ్లపొదల్లోకి పారిపోయింది. పట్టుకోవడానికి కార్పొరేటర్ భూమయ్య బ్లేడ్ ట్రాక్టర్ తెప్పించి వెతికించినా దొరకలేదు. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

బైండోవర్ అతిక్రమించిన వ్యక్తికి జరిమానా

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన మండల కేంద్రానికి చెందిన కిరాణా వర్తక వ్యాపారికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎల్లారెడ్డిపేటలో కిరాణా వ్యాపారం చేస్తున్న మామిండ్ల రాజు నాటుసారాయి తయారీ ముడి పదార్థాలు బెల్లం, పటిక విక్రయిస్తుండగా గతేడాది మే 22న తహసీల్దార్ జయంత్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. రెండేళ్ల వరకు ఎక్సైజ్ నేరాలకు పాల్పడబోనని షరతులతో కూడిన పత్రాన్ని రాసి ఇచ్చారు. కాగా గత నెల 18న బెల్లం, పటిక విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు వివరించారు. బైండోవర్ నిబంధనలను అతిక్రమించి మళ్లీ నేరానికి పాల్పడడంతో రాజుకు రూ.లక్ష జరిమానా విధించినట్లు వివరించారు.

‘సీ విజిల్’ను వినియోగించుకోవాలి

- ప్రతి ఒక్కరూ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి
- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: సీ విజిల్ యాప్‌ను వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు సీ విజిల్ ద్వారా 140 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 125 పరిష్కరించామని, 66 ఫేక్ ఉన్నాయని పేర్కొన్నారు. 100 నిమిషాల్లో పరిష్కరించాల్సి ఉంటుందని, కానీ 66 నిమిషాల్లోనే పరిష్కరించామని వివరించారు. ఇప్పటి వరకు 15 వేల మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని, అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులు 80 ప్లస్ ఉన్నవారు 12,106 మందిని గుర్తించామని, వారు ఇంటి నుంచే ఓటు వేసుకోవాలన్నారు. నామినేషన్లకు ముందే 12 డీ ఫారం అందజేయాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు మొత్తం 785 పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశామని, ఇప్పటికే రెండు బలగాలు వచ్చాయని, మరో ఏడు రానున్నాయని తెలిపారు. ఎన్నికల సమయానికి మొత్తం 3 వేల మంది ఫోర్స్ ఉంటుందని చెప్పారు. ఇప్పటికే నాకాబందీ, వాహన తనిఖీల ద్వారా రూ.3.65 కోట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే లైసెన్స్‌డ్ వెపన్స్ 43 వాపస్ ఇచ్చారని తెలిపారు. 3,100 మందిని బైండోవర్ చేశామని వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లత పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయాలపై ఉక్కుపాదం

- జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్



పట్టుకున్న బెల్లం చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

జగిత్యాల క్రైం: అక్రమ మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం రాయికల్ మండలంలోని రాజనగర్ తండా వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని తెలిపారు. అప్పుడే రాజనగర్ తండా మీదుగా కట్కాపూర్ వెళ్తున్న పెండ్యాల రాజేందర్ ఆటోను ఆపి, చెక్ చేశామన్నారు. అందులో నాటుసారా తయారీ కోసం తరలిస్తున్న 250 కిలోల బెల్లం పట్టుకున్నట్లు తెలిపారు. ఆటోతోపాటు బెల్లం సీజ్ చేశామని, అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జగిత్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం రవాణా, అమ్మకాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించినా, నాటుసారా విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్సైలు మేఘమాల, సరిత, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

చెరుకు రైతుల పోరాటాన్ని ఆపలేరు

- చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి



ఠాణాలో నారాయణరెడ్డి, బుచ్చిరెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): నిర్బంధాలతో చెరుకు రైతుల పోరాటాన్ని ఆపలేరని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి అన్నారు. కోరుట్లలో సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఆయనతోపాటు సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, రైతులను పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేసి, మల్లాపూర్ ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీలను స్వాధీనం చేసుకుంటామన్న బీఆర్‌ఎస్ రెండుసార్లు అధికారం చేపట్టినా ఆ హామీని నిలబెట్టుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని కోరుతున్న చెరుకు రైతులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. షుగర్ ఫ్యాక్టరీలను ఏడాదిలోనే సీఎం కేసీఆర్ మూసివేయించారని అన్నారు. రైతుల సంక్షేమం కోసం లాభనష్టాలతో సంబంధం లేకుండా ఫ్యాక్టరీలను నడపాలని డిమాండ్ చేశారు. వీటిపై కోరుట్ల సభలో సీఎం ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రైతులందరూ తమ ఓటుతో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

బుగ్గారం(ధర్మపురి): మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. చిన్నాపూర్‌కు చెందిన పల్లెర్ల లింగయ్య శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నాడు. గంగాపూర్‌కు చెందిన చెక్కపెల్లి రమేశ్–రమ దంపతులు ధర్మపురి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నారు. చిన్నాపూర్ సమీపంలో వీరి బైక్ లింగయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింగయ్య తీవ్రంగా గాయపడగా స్థానికులు అంబులెన్స్‌లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రమేశ్‌కు సైతం తీవ్ర, రమకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ వారి బంధువులు కారులో జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

‘రైతు నాయకుల అరెస్టు అప్రజాస్వామికం’

మల్లాపూర్(కోరుట్ల): సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభ సందర్భంగా రైతు నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని తప్పుబట్టారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మత్స్యకారుడి గల్లంతు

మంథని: ఎక్లాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నెల్లపల్లికి చెందిన జెట్టి కనుకయ్య(48) అనే మత్స్యకారుడు కుమ్మరికుంట చెరువులో గల్లంతయినట్లు ఎస్సై కిరణ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన సిద్దం సమ్మయ్య, జెట్టి కనుకయ్య సమీపంలోని కుమ్మరికుంట చెరువులో చేపలు పట్టేందుకు శుక్రవారం సాయంత్రం వెళ్లారు. సమ్మయ్య తిరిగి రాగా కనుకయ్య రాలేదన్నారు. చీకటి కమ్మివేయడంతో ఆచూకీ కోసం చెరువులో వెతకడానికి అసౌక్యం ఏర్పడుతోంది. ఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపడుతున్నారు.

జపాన్‌కు పయనమైన హర్షిత



ప్రాజెక్టుతో హర్షిత

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థి డి.హర్షిత శుక్రవారం జపాన్‌కు బయలుదేరి వెళ్లింది. దాసరి మహేశ్–స్వప్న దంపతుల కుమార్తె దాసరి హర్షిత.. గైడ్ టీచర్ సంపత్‌కుమార్ సహకారంతో తను తయారుచేసిన బహుళప్రయోజనకర(హెల్మెట్) హెల్మెట్ ప్రాజెక్ట్ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. ఈనెల 5 నుంచి పదో తేదీ వరకు జపాన్‌లోని టోక్యో నగరంలో నిర్వహించనున్న అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో తన ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నట్లు హెచ్‌ఎం లక్ష్మి, గైడ్ టీచర్ సంపత్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా హర్షిత మాట్లాడుతూ, అంతర్జాతీయ వేదికపై తన ప్రాజెక్టు ప్రదర్శించడం సంతోషంగా ఉందని పేర్కొంది.

మంటలు అంటుకుని అక్కాచెల్లెళ్లకు గాయాలు

గోదావరిఖని(రామగుండం): స్థానిక 7–ఎల్ఈపీ కాలనీలోని ప్రకాశ్‌పాస్టర్ ఇంట్లో శుక్రవారం వంట చేస్తుండగా గ్యాస్ రెగ్యులేటర్ వద్ద మంటలు చెలరేగి అక్కాచెల్లెళ్లు గాయపడ్డారు. సిలెండర్‌కు ఉన్న రెగ్యులేటర్ వద్ద సరిగా లేక మంటలు చెలరేగి సునీత, సుమలత గాయపడ్డారు. సుమారు 40శాతం కాలిన గాయాలపాలయ్యారు. వీరిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

8న అమరుల కుటుంబాలతో నామినేషన్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఈనెల 8న అమరవీరుల కుటుంబాలతో నామినేషన్లు వేస్తామని అమరవీరుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామారెడ్డి తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో మంది అమరులయ్యారని, కానీ ఏనాడు బీఆర్‌ఎస్ పార్టీ అమరుల కుటుంబాలను పట్టించుకోలేదన్నారు. సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట, కామారెడ్డి నియోజకవర్గాల్లో అమరవీరుల కుటుంబాలకు చెందిన 200 మందితో నామినేషన్లు వేస్తామని హెచ్చరించారు.

మద్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని సిరిపూర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై ఎస్ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడి చేశారు. రూ.15 వేల విలువైన 21 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పటిక, బెల్లం..

గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ వద్ద ఎక్సైజ్‌శాఖ అధికారులు, పోలీసులు శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో నాటుసారా ముడి పదార్థాలు పటిక, బెల్లం లభించాయి. రవాణా చేస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకొని, రవాణాదారులైన రామకృష్ణ, రజితలపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆలయాల్లో చోరీ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో గల రెండు ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగలు మార్కండేయస్వామి దేవాలయ తలుపులు ధ్వంసం చేసి, స్వామివారి మెడలోని రూ.20 వేల విలువైన వెండి, బంగారు ఆభరణాలను, హుండీలోని డబ్బులను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. రేణుక ఎల్లమ్మ దేవాలయంలో చొరబడి, హుండీలోని డబ్బులు చోరీ చేశారన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రాయికల్ ఎస్సై అజయ్ తెలిపారు. జగిత్యాల పట్టణానికి చెందిన వెంకటేశ్ 2021లో బాధితురాలిని పెళ్లి చేసుకుంటానని చెప్పి, ఆమె వద్ద రూ.2.55 లక్షలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. యువతి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కాలనీ నుంచి గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓసీపీ–3 ఈపీ ఆపరేటర్ కె.నరేందర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. పోతనకాలనికి చెందిన నరేందర్ తన బైక్‌పై కాలనీ నుంచి పోతనాకాలనికి వెళ్తున్నాడు. ఈక్రమంలో గోదావరిఖని నుంచి వస్తున్న ఓ కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో నరేందర్ అదుపుతప్పి పడిపోయాడు. ఈప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు. స్థానికులు, బ్లూకోల్ట్స్ పోలీసులు వెంటనే 108 అంబులెన్స్‌లో గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు సమాచారం, తమకు ఫిర్యాదు అందలేదని గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.

సీఎం హామీలు నీటి మూటలే



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ధర్మపురిలో గురువారం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నీటి మూటలేనని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులను తప్పుదోవ పట్టించడం కోసమే హుజూరాబాద్ తరహాలో ధర్మపురి నియోజకవర్గంలో దళితబంధు ఇస్తామన్నారని పేర్కొన్నారు. ఆ శాఖ మంత్రిగానే ఉన్న కొప్పుల ఈశ్వర్ రెండేళ్లుగా ఎందుకు ఇప్పించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. 2014 ఎన్నికల సందర్భంగా ధర్మపురికి రూ.500 కోట్లు ఇస్తానని లక్ష్మీనృసింహుని సాక్షిగా సీఎం ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నియోజకవర్గంలో కావాల్సినంత ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని దళితులకు ఎందుకు ఇవ్వడం లేదో మంత్రి చెప్పాలన్నారు. ఇక్కడ కొప్పుల చేసిన అభివృద్ధి ఏమీ లేదని, ఆయన పీఏలు మాత్రం గణనీయంగా ఆస్తులు పెంచుకున్నారని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ధర్మపురికి బస్‌డిపో, రెవెన్యూ డివిజన్, ఐటీఐ, డిగ్రీ కళాశాలలు రాలేదన్నారు. ఆరు గ్యారంటీలతో ముందుకు వస్తున్న కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. నాయకులు ఎస్.దినేశ్, గడ్డం భాస్కర్‌రెడ్డి, వేముల రాజేశ్, బషీర్, సుముఖ్ తదితరులున్నారు.

సంక్షేమాన్ని గాలికొదిలేసిన బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న కుమార్

పెగడపల్లి(ధర్మపురి): నీళ్లు, నియామకాల పేరుతో పదేళ్లుగా పరిపాలన చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని బీజేపీ ధర్మపురి అభ్యర్థి సోగాల కుమార్ ఆరోపించారు. పెగడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నీళ్ల సంగతి కాళేశ్వరం ప్రాజెక్టు చూసిన వారికి అర్థమవుతుందని, నిధుల విషయం వాటిని మింగిన నాయకులకే తెలుసని, నియామకాలు ఎలాంటి ఉపాధి లేక నిర్వీర్యమవుతున్న నిరుద్యోగ యువతకు తెలుసని ఎద్దేవా చేశారు. కార్మికులు, కర్షకులు, అట్టడుగువర్గాల వారి అభ్యున్నతికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, మండల అధ్యక్షుడు కొమురెల్లి, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యం, జిల్లా అధికార ప్రతినిధి సత్యం, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, నాయకులు పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం



ప్రచార రథానికి పూజలు చేసిన నవీన్‌కుమార్

మల్లాపూర్(కోరుట్ల): రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలంలోని వాల్గొండలోని శ్రీరామలింగేశ్వర ఆలయం ఎదుట బీజేపీ ప్రచార రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరాయని తెలిపారు. బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ మూతపడటం సీం కేసీఆర్ అసమర్థ పాలనకు నిదర్శనమని విమర్శించారు. ఎంపీ అరవింద్ ఎన్నికల్లో వాగ్దానం చేసి మరీ పసుపుబోర్డు తెచ్చారని కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు గున్నాల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరిక



కండువా కప్పుతున్న భోగ శ్రావణి

జగిత్యాల: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై చాలామంది బీజేపీలో చేరుతున్నారని ఆ పార్టీ జగిత్యాల అభ్యర్థి భోగ శ్రావణి అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో వివిధ పార్టీలకు చెందిన నాయకులు శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె వారికి కండువాలు కప్పి, ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, రాజేందర్, మల్లేశం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ



మాట్లాడుతున్న మంద కృష్ణ

సిరిసిల్లటౌన్: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా పోరాడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశానికి సంబంధించిన సన్నాహక మీటింగ్ శుక్రవారం సిరిసిల్లలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లతో మాదిగలు, ఉపకులాల ప్రజలు ఎంతో అన్యాయానికి గురవుతున్నారన్నారు. 1994లో ఎగిసిన ఉద్యమానికి స్పందించిన అప్పటి టీడీపీ సర్కారు 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ వేసిందని, అప్పటి నుంచి బిల్లు పాస్ కావడం లేదన్నారు. మాదిగలు, ఉపకులాల హక్కుల సాధన, భవిష్యత్ తరాల సంక్షేమం వర్గీకరణ ద్వారానే సాధ్యమన్నారు. హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప సభకు లక్షలాదిగా తరలిరావాలని కోరారు. కత్తెర దేవదాసు, ఆకునూరి బాలరాజు, కానాపురం లక్ష్మణ్, సంఘం సభ్యులు, బుడగ జంగాల నాయకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలి



సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల తనిఖీలు పక్కాగా చేపట్టాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి సూచించారు. జిల్లా సరిహద్దులోని వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్, బోయినపల్లి మండలం కొదురుపాక చెక్‌పోస్టులను శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు నగదు, బంగారం, ఇతరత్ర కానుకలు పంపిణీ చేసే అవకాశం ఉన్నందున ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఈ ప్రక్రియను చిత్రీకరించాలని సూచించారు. ఆధారాలు లేకుండా భారీ ఎత్తున నగదు, బంగారం వంటివి తరలిస్తే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి రామకృష్ణ, ప్రత్యేక అధికారిణి స్వప్న ఉన్నారు.

అవినీతి పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

- రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

మల్లాపూర్(కోరుట్ల): అవినీతి, ఆర్థిక దోపిడీ, విద్వేష, మతతత్వ రాజకీయాలు చేసే పార్టీలకు ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. జాగో తెలంగాణ పేరిట చేపట్టిన ఓటు చైతన్యయాత్ర శుక్రవారం మల్లాపూర్ మండలం మొగిలిపేటకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడ్డాక పేదరికం లేని తెలంగాణను చూస్తానని అనుకున్నానని, కానీ బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రాన్ని, బీజేపీ దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వాల హయాంలోనూ దోపిడీ జరిగిందని, కానీ ఈ స్థాయిలో దోపిడీ ఏ ప్రభుత్వమూ చేయలేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రజాస్వామిక పరిపాలన చేయట్లేదని, రాజరిక పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణలో విద్య, వైద్యం పూర్తిగా నాశనమయ్యాయని, త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ కేసీఆర్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నిలువునా పాతిపెట్టిందని మండిపడ్డారు. రాష్ట్రంలో కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టులు కడుతున్నారని ఆరోపించారు. ప్రాణహిత తుమ్మిడిహెట్టి నుంచి కాళేశ్వరానికి మార్చిన కేసీఆర్ ఘోరమైన అవినీతి వల్లే ప్రాజెక్టు కుంగిపోయిందని ఆరోపించారు. హిందూ, ముస్లిం, ఇతర ఏ మతోన్మాదాన్ని అయిన తాము వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు మద్యం, నోటుకు లొంగవద్దని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని, వాటిని గద్దెదించేందుకు ప్రజలు ఓటును ఆయుధంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజషా, వినాయక్‌రెడ్డి, నాయినాల గోవర్ధన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతోసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!

గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధపడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటు వ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.



● తగినంత నిద్ర
నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● ఫ్లూ టీకాలు
ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.



● పరిశుభ్రతను పాటించడం
ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● తగినంత దూరం పాటించడం
తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలికాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్ళలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్ళను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్టరాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1993)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.


● కమల్‌హాసన్

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని


● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ' సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పెట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు




సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌పి వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పి వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పి వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరప్పు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.